## క్లుప్తంగా

### వైభవంగా సుమంగళి పూజలు



**రేపల్లె రూరల్:** పవిత్ర కార్తిక మాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని ఇసుకపల్లిలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, శ్రీసూక్త విధానంలో కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా మహిళలు అఖండ సౌభాగ్య సిద్ధికి సుమంగళి పూజలు చేశారు. అమ్మవారి నామ జపం, మణిద్వీప వర్ణన, లలితా సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ కమిటీసభ్యులు భక్తు లకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి రక్షాబంధనాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, అర్చకులు పవన్ కుమార్ శర్మ, ఫణి కుమార్ శర్మ, వాసు శర్మ, రామకృష్ణ ప్రసాద్ శర్మ, మారుతీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



**రేపల్లె రూరల్:** డిసెంబర్ 1వ తేది ఎయిడ్స్ డేను పురస్కరించుకుని కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఆదేశాల మేరకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న వారోత్సవాలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ఎయిడ్స్ సంక్రమించే విధానం, వ్యాధి మనిషిలో అభివృద్ధి చెందితే కలిగే మార్పులు తదితర అంశాలపై బొమ్మలను గీసి ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా బి.కోటేశ్వరరావు, డాక్టర్ వీవీ రవీంద్ర, కే బాల గురవయ్యలు వ్యవహరించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బుజ్జి బాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### పౌర చట్టాలపై అవగాహన తప్పనిసరి

**తహసీల్దార్ శ్రీనివాసరావు**



**రేపల్లెరూరల్:** ప్రభుత్వం రూపొందించిన పౌర చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రావిఅనంతవరం గ్రామం ఎస్సీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో తమ ఉనికి గౌరవ ప్రదంగా నడవాలంటే చట్టాలు తెలిసి ఉండాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించే పౌర హక్కులు జీవితానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్య, వైద్యం పొందటంతో పాటు ఓటు హక్కు సైతం ప్రభుత్వం ప్రసాదించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు హక్కులు, చట్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారం విజయ్, ఆర్‌ఐ రాంబాబు, పశు వైద్యుడు ప్రవీణ్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### భట్టిప్రోలు హైస్కూల్ సందర్శించిన డిప్యూటీ డీఈవో



**భట్టిప్రోలు:** భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌ను బాపట్ల డిప్యూటీ డీఈవో జి.వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించారు. హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం, తరగతి గదులు, మరుగుదొడ్లు, విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డుల నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల సామర్థ్యం, మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ నిర్వహణ, అపార్ ఐడీ కార్డుల పనితీరును పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో పులి లాజర్, ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# చెరుకుపల్లి @ ధ్వజ స్తంభం

- ప్రముఖ ఆలయాలకు చెరుకుపల్లి ధ్వజ స్తంభాలు
- రాష్ట్రాలు దాటి వెళుతున్న ధ్వజ స్తంభాలు





ప్రత్యేక వాహనంలో న్యూఢిల్లీకి తరలించిన ధ్వజ స్తంభం (ఇన్‌సెట్) జమ్మూ కాశ్మీర్‌కి తరలించిన 60 అడుగుల ధ్వజ స్తంభం

**చెరుకుపల్లి:** పవిత్ర దేవాలయాల వద్ద ప్రతిష్ఠించే ధ్వజ స్తంభాలకు దశాబ్ద కాలం నుంచి కేరాఫ్ అడ్రస్ చెరుకుపల్లి అయింది. మండలంలోని గుళ్ళపల్లి గ్రామానికి చెందిన పడితపు మధు అనే వ్యక్తి గత 20 సంవత్సరాలుగా టేకు కలప వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఆ వ్యాపారి వద్దకు ఒకసారి అమృతలూరు మండలంలో శివాలయ ప్రతిష్ఠకు ధ్వజస్తంభం కావాలని కొందరు వచ్చి అడుగగా తన వద్ద లేకపోయినా కొంత సమయం ఇస్తే అందిస్తానని చెప్పాడు. తరువాత ధ్వజస్తంభం కోసం అన్వేషించి కేరళలో లభిస్తుందని తెలుసుకున్నాడు. అక్కడ నుంచి కలప దిగుమతి చేసుకొని ధ్వజస్తంభం తయారు చేయించి సమయానికి వారికి అందజేశాడు. అప్పటి నుంచి ధ్వజస్తంభాలు తయారు చేయించాలని నిర్ణయించుకొని నేడు కొన్ని రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాడు.

### ప్రత్యేక కలపతో తయారీ



ధ్వజ స్తంభం తయారు చేస్తున్న వడ్రంగి కూలీలు

ధ్వజ స్తంభాల తయారీకి కేరళ రాష్ట్రం నుంచి నార వేపి, టేకు కలపను ప్రత్యేక వాహనాల్లో తెప్పించి నిష్ణాతులైన పనివారితో మరియు మిషన్‌ల ద్వారా ఒక్కో ధ్వజ స్తంభం 10 నుంచి 15 రోజుల్లో తయారు చేసి అవసరమైన వారికి సకాలంలో అందించుతారు.

**ఇతర రాష్ట్రాలకు ధ్వజస్తంభాలు సప్‌లై**

చెరుకుపల్లిలో తయారైన ధ్వజస్తంభాలను జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ నోయిడా, మధ్యప్రదేశ్ గ్వాలియర్‌తో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లాకు 10 నుంచి 20 ధ్వజస్తంభాలు అందించి ఇప్పటికి 800 ధ్వజస్తంభాలు తయారు చేసి అమ్మినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు 60 అడుగుల ఎత్తు ధ్వజ స్తంభం తయారు చేశామన్నారు.

**ప్రముఖ ఆలయాలకు ధ్వజ స్తంభాలు**

తెలంగాణలోని ప్రత్యేక ఆలయాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ దుర్గా జీవేశ్వరస్వామి ఆలయానికి ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి, అన్నవరం సత్యన్నారాయణస్వామి, త్రిపురాంతకం శివాలయం, విజయవాడ శనీశ్వర ఆలయం, రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో చెరుకుపల్లిలో తయారైన ధ్వజస్తంభాలనే ప్రతిష్ఠించారు.

**వ్యాపారంతో పాటు భక్తి భావం**



ధ్వజ స్తంభాల వ్యాపారి పడితపు మధు మాట్లాడుతూ వ్యాపారంతో పాటు భక్తి భావం ఉండటంతో ఈ ధ్వజ స్తంభాల తయారీ వైపు ఆసక్తి చూపాను. నేను పంపిన ధ్వజ స్తంభాల ప్రతిష్ఠకు సాధ్యమైనంత వరకు వెళుతూ ఉంటాను. త్వరలోనే తిరుమల తిరుపతి దేవస్థానానికి కూడా అందించాలనుకుంటున్నాను. ఈ ధ్వజస్తంభాల తయారీతో ఎంతో సంతృప్తి చెందాను.

– పడితపు మధు, ధ్వజ స్తంభాల వ్యాపారి

## రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

**వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు**



నూతన గ్రామ కమిటీ సభ్యులతో సమన్వయకర్త అశోక్‌బాబు, ఎంపీపీ లలితకుమారి, నాయకులు

**చింతమోటు(భట్టిప్రోలు):** రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ విజయ పతాకం ఎగురవేయడం తథ్యమని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలోని మండలాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రామ కమిటీల నియామక కార్యక్రమం శుక్రవారం భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామంలో నిర్వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాను సారం గ్రామ పార్టీ కమిటీలను నియమిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తల సూచనలు అనుసరించి నూతన కమిటీని నియమించారు. గ్రామ కమిటీ నూతన అధ్యక్షులుగా జంపని రవిబాబు మరో నలుగురు ప్రధాన, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, సర్పంచ్ గుమ్మడి శంకరరావు, నాయకులు పడమట శ్రీనివాసరవు, జంగం వాసు, శొంఠి రాము, దావూరి నాగమల్లేశ్వరరావు, జల్లి జోషికాంత్, గుజ్జర్లమూడి రాజు, శొంఠి జయకృష్ణ, జడా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు పింఛన్ల పంపిణీ

**భట్టిప్రోలు:** డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం ఒక రోజు ముందుగానే సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎస్.వెంకట రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ నెలలో పింఛన్ తీసుకోని వారికి రెండు నెలల పింఛన్ అందచేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజ



**తెనాలి:** పవిత్ర కార్తికమాసంలో మాసశివరాత్రి సందర్భంగా స్థానిక మారీసుపేటలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం విశేషపూజా మహోత్సవం నిర్వహించారు. ఉదయం శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. తర్వాత అమ్మవారికి ప్రీతిగా ముత్తయిదువలచే సామూహిక కుంకుమార్చన జరిపారు. మధ్యాహ్నం స్వామి కి లక్ష బిల్వార్చన, సాయంత్రం మహా జ్యోతిర్లింగార్చన, హారతి, మంత్రపుష్పం, శివపార్వతుల శాంతి కల్యాణం చేశారు. అనంతరం కార్తిక సమారాధన చేశారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, సభ్యులు పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

## బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, గ్రామస్తులు

**కొల్లూరు :** బాల్య వివాహాల కారణంగా ఆడపిల్లలు అనారోగ్యాల బారిన పడే ముప్పు పొంచి ఉన్నందున బాల్య వివాహాలను నిర్మూలించడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని ఐసీడీఎస్ అమృతలూరు ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని పెసర్లంకలో అనంతవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ఐసీడీఎస్ సిబ్బంది పర్యవేక్షించడంతో పాటు, ప్రజలకు బాల్య వివాహాల కారణంగా వాటిల్లే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్థానికులతో కలసి అవగాహనా ప్రదర్శన నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఏ విజయరాణి, అనంతవరం సెక్టార్ సూపర్‌వైజర్ నాగరాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కాశివిశాలాక్షి, బాలాత్రిపురసుందరి, నాంచారమ్మ, పద్మ పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యాలతో రైతులు కుదేలు




భట్టిప్రోలు-పల్లెకోన రహదారిలో నేల వాలిన వరి పంట

**భట్టిప్రోలు:** పంట ఇంటికి చేరే దశలో రైతులు ఎంతో ఆశతో ఎదురు చూసే తరుణంలో ఏటా అన్నదాతను ప్రకృతి వైపరీత్యాలు కలవరపెడుతున్నాయి. వాయుగుండాల ప్రభావంతో చేతికి వచ్చిన పంట తడిసిపోవడంతో ఆవేదనతో రైతులు అల్లాడిపోతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొరగాకుండా పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల వరి చేలు నేలకు ఒరిగాయి. చిరు జల్లులు, చలి గాలులు వీస్తున్నాయి. పంట పొలాల్లో కోసిన వరి పంట ఓదెల రూపంలో అలానే ఉంది. పలువురు రైతులు హార్వెస్టర్ల ద్వారా కోత కోసిన ధాన్యాన్ని భద్రపరచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఓదె దశలో ఉన్న పంటను కొందరు హడావుడిగా కుప్పలు వేశారు. ఆరబెట్టలేని పరిస్థితిలో కుప్పలు వేయాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు.

**కొల్లూరు :** అకాల వర్షంతో అన్నదాతల గుండెలు గుబేలుమంటున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన ప్రభావంతో శుక్రవారం సాయంత్రం మండలంలో వర్షం కురిసింది. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట కోత దశలో ఉన్న సమయంలో వర్షం కురవడంతో రైతులు కలవరపాటుకు గురయ్యారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా వర్షం ఏ సమయంలో పడుతుందోనన్న ఆందోళన నడుమ యంత్రాల సాయంతో వరి కోతలు చేపడుతున్న రైతులు ఉన్న పళంగా వర్షం పడడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు సతమతమయ్యారు. పొలాల్లో మెరక ప్రాంతాలు, రహదారుల వెంబడి పోసిన ధాన్యపు రాశులు, ధాన్యం బస్తాలు వర్షం బారిన పడకుండా టార్పాలిన్‌లతో కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. తుపాను ప్రభావంతో వర్షాలు ఊపందుకున్నట్లయితే, కోతలు పూర్తయిన పొలంలో నాటిన మొక్కజొన్న పంట దెబ్బతినడంతో పాటు, మెట్ట ప్రాంతాల్లో సాగు చేసి చేతి కందే దశకు చేరుకున్న మినప పంటకు సైతం నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



కొల్లూరు సమీపంలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్‌లు కప్పుతున్న రైతులు



జంపని గ్రామంలో ధాన్యం బస్తాలకు పట్టాలు కప్పిన రైతులు

**వర్షంతో రైతుల ఇక్కట్లు**

**వేమూరు:** ఫెంగల్ తుఫాన్ వల్ల కురుస్తున వర్షాలకు రైతులు ధాన్యం తడవకుండా కాపాడేందుకు అవస్థలు పడుతున్నారు. వేమూరు నియోజకవర్గంలో హార్వెస్టర్ ద్వారా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షం వల్ల రైతులు వరి ధాన్యానికి పట్టాలు కపుతున్నారు. రైతులు ధాన్యానికి ధర లేక బాధ పడుతుంటే ఫెంగల్ తుఫాన్ వల్ల కురుస్తున వర్షాలకు ప్రయివేటు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తారు లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**తాడేపల్లిరూరల్ :** దుగ్గిరాల రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి, మోసపోవద్దని వ్యవసాయ అధికారి పి.శిరీష పేర్కొన్నారు.శుక్రవారం మండల పరిధి లోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కల్పించిందని, కొనుగోలుకు గోతాలను డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తోందన్నారు. ముఠా కూలీ ఖర్చులు క్వింటాకు రూ.17.17 చొప్పున చెల్లిస్తుందని, రవాణా సౌకర్యం కూడా కల్పిస్తోందని వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి పేర్లను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

## ఐకమత్యం పెంపొందించేందుకే వన సమారాధనలు

**రేపల్లె చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు**



డాక్టర్ ఆకురాతి సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న పద్మశాలీయ నాయకులు

**రేపల్లె రూరల్:** సంఘీయుల మధ్య ఐకమత్యం పెంపొందించేందుకు వన సమారాధనలు ఎంతగానో దోహదం చేస్తాయని రేపల్లె చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. పద్మశాలీయ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓల్డ్‌టౌన్‌లోని రాచూరి జమీందారు కోటలో శుక్రవారం నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘీయులలో ఆర్థికంగా వెనకబడి ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేనేత వస్త్రాలకు ఆదరణ కరువవుతోందని, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురు పద్మశాలీయ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, పద్మశాలీయ సంఘం నాయకులు గుద్దంటి వెంకట నాగేశ్వరరావు, నారాయణం రామమోహనరావు, పాలిశెట్టి శ్రీనివాసరావు, జొన్నాదుల నాగరాజు, కొతరపు నాంచారరావు, యెంగళ సంజీవయ్య, పాలిశెట్టి సాంబశివరావు, సాధు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష దీపోత్సవం



బూరుగులమ్మ ఆలయ ఆవరణలో లక్ష దీపోత్సవం



సాయిబాబా ఆలయ ఆవరణలో కర్పూర యజ్ఞంలో భక్తులు

**రేపల్లె రూరల్:** పవిత్ర కార్తిక మాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని పలు దేవాలయాల్లో కార్తిక దీపోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేయటంతో ఆలయ ఆవరణలో లక్ష దీపోత్సవం చేసి కర్పూర యజ్ఞం నిర్వహించారు. అదేవిధంగా రైలుపేటలోని సాయినాథుని ఆలయంలో కర్పూర యజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వేడుకల్లో పాల్గొని దీపోత్సవంలో నువ్వుల నూనె, కర్పూర యజ్ఞంలో కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## బాలల విద్య, భద్రత కోసం సహకరించాలి



**అమర్తలూరు(వేమూరు):** బాలల విద్య, భద్రత కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి అన్నారు. అమర్తలూరు మండలంలోని వాముగుంటపాలెం గ్రామంలో మోపర్రు సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం బాల్య వివాహ రహితంగా ఆంధ్రప్రదేశ్ ఉండాలని గ్రామంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరం అన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధార్ సవరణలు వేగవంతం చేయాలి

**కర్లపాలెం:** ఆధార్ కార్డులో చేపట్టాల్సిన సవరణలను వేగవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. యాజలి గ్రామ సచివాలయంలోని ఆధార్ సెంటర్‌ను శుక్రవారం ఎంపీడీవో సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో సవరణల కోసం వచ్చే వారి పూర్తి వివరాలను తెలుసుకుని సవరణ చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మేరకు ఆధార్ కార్డులో త్వరగా సవరణలు చేసేందుకు సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. అనంతరం యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జరుగుతున్న వైద్య ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య విషయాలను సంబంధిత చార్టులలో నమోదు చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వెంట ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## జాబ్ మేళాలో 18 మంది ఎంపిక



**వేమూరు:** ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమం నిరుద్యోగులు సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ అన్నారు. వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 34 మంది హాజరు కాగా వివిధ కంపెనీలకు 18 మందిని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి మాట్లాడుతూ జాబ్ మేళాలో విద్యార్హతను బట్టి ఉద్యోగాలు పొందడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో ఆర్డినేటర్స్ రవి కుమార్, హరీష్, జేఆర్‌పీ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సహస్ర దీపాలంకరణ సేవ



**పెదపులివర్రు(భట్టిప్రోలు):** వ్యాఘ్రపురి క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత ఆలయంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ కనుల పండువగా జరిగింది. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో తులతూగాలని పూజలు నిర్వహించారు. స్వయంభువుగా వెలసిన రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని స్వామి వారికి ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కఠెవరంలో మాస శివరాత్రి వేడుకలు

**తెనాలి:** రూరల్ మండల గ్రామం కఠెవరంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మాసశివరాత్రి వేడుకలు వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బరాజు, సభ్యులు వెంకటరమణ, వెంకమరాజు, ఆలయ అర్చకుడు ప్రతాప్‌రుద్ర శర్మ ఆధ్వర్యంలో 'మహన్యాస పూర్వక రుద్రాభిషేకం', 'లక్ష బిల్వార్చన' నిర్వహించారు.